# ఎవరికి వారే...

లక్ష్మీ శ్రీనివాసన్



ఆ రోజు ఫస్టు తారీఖు

జీతం తీసుకుని ఆఫీసునుంచి ఇంటికొచ్చాడు ఈశ్వర్రావు

కాఫీతో బాటు కావాల్సిన సరుకుల లిస్టు అతని ముఖాన పడేసింది భార్యామణి సరోజ

జీతం తీసుకొని ఇంటికి రాగానే ఇదొకటి తయారు ఒక్కరోజు ఆలస్యం కావటానికి వీల్లేదు! విసుక్కున్నాడు ఈశ్వర్రావు

తినడం మానేస్తే సరి! విసురుగా సమాధానం చెప్పింది సరోజ

మరి బతకట మెలాగ?

గాలి పీల్చుకుని

సమాదానాలకు లోటులేదు! గుర్రుగా సరోజ వైపు చూశాడు ఈశ్వర్రావు

లేకపోతే ఏమిటండి! బతకాలంటే తినాలి తినడానికి ఇవన్నీ కావాలి ఔనా? అందుకని బుద్ధిగా బజారు కెళ్లి బియ్యంతో సహా అన్నీ తీసుకుని తొందరగా ఇంటికి రండి ఇందాక కొబ్బరికాయలు కావాలని ఎవరో వచ్చారు మీ రొచ్చాక రమ్మని చెప్పాను అవి అమ్మేస్తే మనందరం కొత్త బట్టలు కొనుక్కోవచ్చు! అంది ఇక ఈశ్వర్రావు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా సరోజ

కాదనుకున్నా సరోజ చెప్పినవి తేవటం తప్పదు గనక – కాఫీ తాగటం పూర్తి చేసి సరోజ అందించిన సంచీ సైకిలు తగిలించుకొని బజారుకు బయల్దేరాడతను

ఈశ్వర్రావు మధ్య తరగతి మానవోత్తముడు అతడు చేసే చాకిరికి ఆఫీసు వారిచ్చే జీతం ఏడొందలు ముచ్చటగా ముగ్గురే పిల్లలు వుంటున్నది సొంతిల్లు కాబట్టి అద్దె బాధలేదు ఆ ఇంటి చుట్టూ వున్న గ్రౌండ్‌లో అతడి తాతల కాలంనాటి కొబ్బరి చెట్లు ట్రిప్పుకు ఏడెనిమిది వందల కాయవరకూ దిగి అప్పుడప్పుడూ అతన్ని ఆదుకుంటూ వుంటాయి

భార్య ఇచ్చిన ప్రకారం సరుకులన్నీ తీసుకొని గంట తర్వాత ఇంట్లో కదుగుపెట్టిన ఈశ్వర్రావు – సరుకులతో వున్న సంచీ విసురుగా క్రిందపడేసి – ఇక లాబం లేదు! లాబంలేదు!! అంటూ మంచంమీద కూలబడ్డాడు

అతడి మాటలు ఏకోశానా అర్ధంగాని సరోజ ఏమిటి లాబంలేదు? అంది అయోమయంగా

మనలాంటి మనుషులు బతికి లాబంలేదు! చెప్పాడు ఈశ్వర్రావు

చావొచ్చేవరకూ బతకడం తప్పదే! ఇంతకీ మీ కొచ్చిన కష్టం ఏమిటి?

కష్టం అని నెమ్మదిగా అంటావేమిటి? ఇదిగో ఈ లిస్టు చూడు ఈ లిస్టులో దర్మయ్యశెట్టి వేసిన ధరలు చూడు అమ్మమ్మ ఒక్క కొబ్బరి నూనె తప్ప – మెంతులు దగ్గర్నుంచి మినపప్పువరకూ టూత్‌పేస్ట్ దగ్గర్నుంచి ఫేస్ పౌడర్‌వరకూ అన్నీ రేట్లు పెరిగిపోయాయ్! ఈ రేట్లు ఇలా పెరుగుతూంటే మనం ఎందుకు బతకాలి? ఎలా బతకాలి? ఇక లాబంలేదు ఇక్కడ స్వార్ధపరు లెక్కువైపోయారు ప్రజల్ని దోచుకు తింటున్నారు ఇక ఈదేశం బాగుపడదు బాగుపడదు అంటూ ఆయాసం రావడంతో ఆగాడు ఈశ్వర్రావు

ఎందుకండీ అంత బెంబేలు పడిపోతున్నారు? దరలు పెరిగితే మీకు జీతాలు పెంచుతారు కదా! అంది బర్త ఇచ్చిన లిస్టు చూస్తూ సరోజ

ఈశ్వర్రావు ఏదో అనేటంతలో బయటనుంచి పిలుపు వినిపించింది ఎవరో చూడు! అన్నాడు సరోజతో

బయటికెళ్లి చూసొచ్చి ఇందాక కొబ్బరికాయలకోసం వచ్చాడని చెప్పానే అతడేనండీ! వచ్చి మాట్లాడండి! అంది సరోజ

ఈశ్వర్రావును చూస్తూనే బయట నిల్చున్న వ్యక్తి ఓ నమస్కారం పారేసి తనొచ్చిన పని మరోసారి చెప్పుకున్నాడు

ఎలా తీసుకుంటున్నారు? అన్నాడు ఈశ్వర్రావు

వంద నూటపదిచేసి కొంటున్నామనుకోండి ఇందాక అమ్మగారు కాయ సైజు చూపించారు అన్నీ అలాగే వుంటే నూటఇరవైచేసి తీసుకుంటాననండి! అన్నాడా ఆసామి

ఈశ్వర్రావు కొన్ని క్షణాలపాటు ఆలోచించి వాటిని ఇప్పుడు అమ్మదల్చుకోలేదు! అన్నాడు

పోనీ నూట ముప్పై తీసుకోండి!

అమ్మను మొర్రో అంటూంటే అర్ధం కావటం లేదేమిటయ్యా నీకు? మరోసారి చెబుతున్నాను ఇప్పుడు నేను కొబ్బరికాయలు అమ్మను ఇక నువ్వు వెళ్లొచ్చు! అని రుసరుసలాడుతూ లోపలి కొచ్చేశాడు ఈశ్వర్రావు

బాగుంది మీ వరస! కాళ్ల దగ్గర కొచ్చిన బేరం చెడగొట్టారేమిటి? ఇప్పుడు వందరూపాయలకు మించి కొబ్బరికాయ ఎవరూ కొనడంలేదు తెలుసా? ఇంతకీ మీరు వాటిని కొబ్బరి నూనె ఆడించదల్చుకున్నారా? అంది సరోజ

పిచ్చిదానా ఈ నెలా పోతే కొబ్బరికాయ దర అద్దుగా పెరిగిపోతూంది కొబ్బరి నూనె మళ్లీ కె జి అరవై రూపాయల అమ్మి తీరుతుంది అలా చూస్తూ వుండు! అవేం చెడిపొయ్యేవి కాదుగదా ధర పెరగనియ్యి పెరిగాకనే అమ్ముదాం! అన్నాడు అతి మామూలుగా ఈశ్వర్రావు

అదేమిటండి ఇప్పుడేగా ధరలు పెరిగిపోతున్నాయి – అందరూ స్వార్ధపరులే అంటూ గొడవ చేశారు – మరి మీరే ధరలు పెరగాలని చూస్తున్నారేమిటి!? ఆశ్చర్యంగా అని చూశారా ఇలా ఎవరికి వారే స్వార్ధంతో ప్రవర్తిస్తుంటే – ప్రతి మనిషి మరి యొకరిని దోచుకు తినటానికే ప్రయత్నిస్తూంటే ఇక ఈ దేశం ఎలా బాగుపడుతుందంటారు? అంది కించిత్ ఆవేశంతో సరోజ

సరోజ కెలా సమాదానం చెప్పాలో ఈశ్వర్రావుకా క్షణంలో తెలియలేదు □